

గిడ్డంగుల సంస్థకు జవసత్వాలు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది నగరంలోని కోడుమూరు రోడ్డు రేడియో స్టేషన్ వద్ద ఉన్న గోడౌన్. దీని సామర్థ్యం 6వేల మెట్రిక్ టన్నులు. గత ఐదేళ్లుగా ఇందులో ఒక్క బియ్యం గింజ కూడా నిల్వ చేయలేదు. సివిల్ కార్పొరేషన్ అధికారులు ఏవేవో కుంటి సాకులు చెప్పడం వల్ల ఈ గోదాములో నిల్వ చేయాల్సిన బియ్యం, ఇతర ఆహారోత్పత్తులు ప్రైవేటు గోదాములకు తరలిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మళ్లీ జవసత్వాలు కల్పిస్తుండటంతో ఇలాంటి గిడ్డంగులకు పూర్వ వైభవం రానుంది.

- జీవో 565ను నీరుగార్చిన గత వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం మీద ఎస్‌డబ్ల్యూసీ వర్గాల ఆశ
- లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసరాల నిల్వకు కార్యాచరణ
- జీవో 565 పకడ్బందీగా అమలుకు ఎస్‌డబ్ల్యూసీ ఎండీ చర్యలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులను భద్రంగా నిల్వ చేసేందుకు, బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనప్పుడు తాత్కాలికంగా దాచుకొని బ్యాంకుల్లో రుణం తీసుకొనేందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములు ఉపయోగకరంగా ఉండేవి. 1956లో రాష్ట్ర ప్రభుత్వం ఈ గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసీ)ను ఏర్పాటు చేసింది. రైతుల పంట ఉత్పత్తులను భద్రపరచడమే కాకుండా సివిల్ సప్లయ్, నాఫెడ్, మార్క్‌ఫెడ్ తదితర సంస్థలకు గోదాములను సమకూర్చే బాధ్యతను కూడా ఈ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకే ప్రభుత్వం అప్పగించింది. అయితే ఈ రాష్ట్ర గిడ్డంగుల సంస్థను నిర్వీర్యం చేసే మహాకుట్రకు గత సీఎం జగన్ రెడ్డి పాల్పడ్డారు. ఈ సంస్థకు జవసత్వాలు కల్పించడం కోసమని 2022 సెప్టెంబరు 1న జీవోఆర్‌టి. నెం. 565ను తీసుకొచ్చారు. ఈ జీవో ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాల కోసం మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్, నాఫెడ్ తదితర సంస్థలకు అవసరమైన బియ్యం, కందులు, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను సేకరించి గోదాముల్లో నిల్వ చేసే బాధ్యతను రాష్ట్ర గిడ్డంగుల సంస్థనే చేపట్టాలని, నోడల్ ఏజెన్సీగా ఈ సంస్థనే బాధ్యత తీసుకోవాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాం వరకు ఈ సంస్థ కార్యకలాపాలు విస్తృతంగా జరిగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవోను సృష్టించి, క్రమంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో ఉన్న గోదాములను కూడా శిథిలావస్థకు చేర్చారు. గోదాముల మరమ్మతులకు ఒక్క రూపా యి నిధులను కూడా మంజూరు చేయలేదు. దీంతో ఆ గోదాములన్నీ పంట ఉత్పత్తుల నిల్వకు ఏ మాత్రం పనికి రాకుండా పోయే పరిస్థితిని తీసుకువచ్చారు. ఇదే అదునుగా వైసీపీ నేతలు ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసే అవకాశం లేదని ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉన్న గోదాములను అద్దె ప్రాతిపదికన తీసుకుని నిత్యావసరాల వస్తువుల నిల్వకు ప్రభుత్వ అనుమతి ఇవ్వాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. వారి కుట్ర ఫలించడంతో సివిల్ సప్లయ్ సంస్థతో పాటు మార్క్‌ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థలన్నీ నాయకులు, వ్యాపారుల ఆధ్వర్యంలో ఉన్న గోదాముల్లోనే బియ్యం, కందులు, మొక్కజొన్నలు తదితర వాటిని నిల్వ చేయించారు. మరో వైపు సివిల్ సప్లయ్ గోదాముల్లో నిల్వ ఉంచిన బియ్యాన్ని పక్కదారి పట్టించేసి కోట్లు దండుకునే దుర్మార్గానికి తెరలేపారు.

మిగతా 6వ పేజీలో...

గృహ నిర్మాణ సంస్థ ఈఈగా వెంకట దాసు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గృహ నిర్మాణ సంస్థ కర్నూలు డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరుగా పి.వెంకట దాసు నియమితులయ్యారు. మదనపల్లి డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఆయన్ను కర్నూలుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు గతవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా ఉప ఇంజనీరు ప్రభాకర్ ఈ స్థానంలో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు.

రుణాల్లో మహిళలకు ప్రాధాన్యం

- మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్



జూమ్ సమావేశంలో పాల్గొన్న మెప్మా పీడీ, అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి మెప్మా మహిళా, పట్టణ సమాఖ్య ప్రతినిధులు, అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక కౌన్సిల్ హాలులో జరిగిన సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేసి జీవనోపాధుల కల్పన ద్వారా కుటుంబ తలసరి ఆదాయం పెంచే దిశలో మెప్మా పని చేస్తుందన్నారు. ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ ద్వారా సంఘాల, సభ్యుల సమగ్ర డేటా సేకరిస్తామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8 నాటికి ఒకే రోజు లక్ష ఉత్పత్తులకు పైగా అమ్మకాలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం భాస్కర్‌రెడ్డి, టీఎంసీ సుధాకర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతియుత పాలన

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతియుత పాలన సాగుతోందని కుడా చైర్మన్, టీడీ పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్టం తన పని తాను చేసుకునే స్వేచ్ఛను సీఎం చంద్రబాబు నాయుడు కల్పించారన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి స్వార్థ ప్రయోజనాల కోసం వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే గంటలోనే అంబటి రాంబాబు ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజలకు అన్యాయం జరిగిన వాటిపై, ప్రజలను మోసగించిన వారి పేర్లు మాత్రమే రెడ్‌బుక్‌లో ఉంటాయన్నారు. రెడ్ బుక్ పేరెత్తితే వైసీపీ నేతలకు అంత ఉలుకెందుకు అన్నారు.

నేటి నుంచి కేఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం 15, 16 తేదీల్లో కేఎంసీ ఆడిటోరియంలో జరుగుతున్నట్లు అల్యూమినీ ఆర్గనైజింగ్ చైర్మన్ డా.బి.కుమారస్వామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా పూర్వవైద్య విద్యార్థులు మాజీ మంత్రులు డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి, డాక్టర్ బీఎల్ రవీంద్రారెడ్డి, రిటైర్డు డీజీపీ డాక్టర్ టి.నాయక్ హాజరవుతారన్నారు. సదస్సుతో పాటు నూతనంగా వైద్య విధానంలో వచ్చిన మార్పులను స్పెషలిస్టు వైద్యులు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఐ.రమేష్, సిటీవీఎస్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డితో పాటు 700 మంది వైద్యులు హాజరవుతారన్నారు.

స్వచ్ఛాంధ్రలో వెనుకబాటు

- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం
- స్వచ్ఛతలో 21వ స్థానంలో కర్నూలు జిల్లా

కర్నూలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారు. పల్లె, పట్టణాల్లో పౌరులు భాగస్వాములు కావాలి. ఇల్లు.. కాలనీ.. ఊరు స్వచ్ఛత కోసం పాటుపడాలి..! మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారులు.. గ్రామ సర్పంచ్ నుంచి మంత్రుల వరకు చెబుతున్న మాటలు ఇవి. వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. నగరం, మున్సిపాలిటీ పట్టణాల్లో ఓ రకంగా స్వచ్ఛత కోసం పాటుడుతుంటే.. గ్రామీణ ప్రాంతాల్లో ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ప్రతి నెల మూడో శనివారం 'స్వచ్ఛత దివస్' నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ రాజ్ శాఖ స్వచ్ఛతపై 14 అంశాలపై పక్కాగా సర్వే నిర్వహించారు. జిల్లా 21వ స్థానంలో నిలిచింది. అంటే స్వచ్ఛతలో జిల్లా ఎంత వెనుకబడి ఉందో తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 484 పంచాయతీలు, 237 మజారా గ్రామాలు కలిపి 721 పల్లెలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలు, కర్నూలు నగర పాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన పూర్తిగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ పథకం అమలు చేస్తుంది. ఇందుకోసం భారీగా నిధులు కూడా ఖర్చు చేస్తుంది. కేంద్రం స్ఫూర్తితో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మంగా అమలు చేస్తోంది. గడిచిన రెండేళ్లలో స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా రూ.41.02 కోట్లతో 998 పనులు చేపట్టారు. 651 పనులు పూర్తి చేశామని, 337 పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. 30 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులే అంటున్నారు.

స్వచ్ఛతలో జిల్లా 21వ స్థానం: స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు 14 అంశాలపై సర్వే నిర్వహించాయి. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, ఇంటింటి చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, పాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కమ్యూనిటీ సోక్ పిట్స్, పరిశుభ్ర గ్రామాలు (క్లీన్ విలేజ్), ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్.. వంటి అంశాల్లో జిల్లా వారిగా పురోగతి సర్వే చేశారు. ఒక్కో అంశానికి 10-20 పాయింట్లు కేటాయించారు. పై అంశాలు అమలవుతున్న తీరుపై సర్వే అధికారులు పాయింట్లు ఇచ్చారు. ఆ వివరాలను స్వచ్ఛాంధ్ర మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. మొత్తం 200 పాయింట్లకు గానూ 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా ప్రథమ స్థానంలో ఉంటే.. 99 పాయింట్లతో కర్నూలు జిల్లా 21వ స్థానంలో నిలిచింది. 94 పాయింట్లతో నంద్యాల జిల్లా 23వ స్థానంలో ఉంది.

దళారులను నమ్మకండి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు ఎవరూ మోసపోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలో నియామకాలు, భర్తీ ప్రక్రియ పారదర్శ కంగా జరుగుతున్నాయన్నారు. నియామక ప్రక్రియపై కొందరు వదంతులు సృష్టిస్తూ, నిరుద్యోగులను మోసగించేందు కు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ప్రతిభ ఆధారంగానే ఉంటుందన్నారు. ఎంపిక, అభ్యంతరాల స్వీకరణ ఇలా ప్రతీది జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు.

అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



విద్యార్థినులకు కంటి అద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళతో కలిసి విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గ్రామంలో దృష్టి లోపాలు ఉన్న 46 మంది విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశామన్నారు. డీఎంహెచ్‌వో శాంతి కళ మాట్లాడుతూ జిల్లాలో 1,26,412 మంది విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా పరీక్షలు నిర్వహించామన్నారు. 3700 మంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించి కంటి అద్దాలను అందజే శామన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సంధ్యారాణి, డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి తిరుమలేశ్వరరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ మధునరసింహ, ప్రిన్సిపాల్ ఈరన్నరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఈవోకు కేటాయించిన నివాస గృహం రద్దు



ఏఈవో సాయి కుమారికి కేటాయించిన ఎంఐజీ 103 గృహం

సున్నిపెంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఏఈవో కె. సాయి కుమారికి కేటాయించిన వసతి గృహం ఉత్తర్వులను ఎం.శ్రీనివాసరావు శుక్రవారం రద్దు చేశారు. అంతర్గత బదిలీలలో భాగంగా దేవస్థానానికి దత్త దేవాలయమైన కడప జిల్లా సిద్దవటం జ్యోతి సిద్ధవటేశ్వర స్వామి దేవస్థానానికి సాయి కుమారిని బదిలీ చేశారు. అయితే అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ముఖ్య అనుచరుడు స్థానిక వైసీపీ నాయకుడు ఎం.ఏ. రజాక్ సదరు ఎంఐజీజీ 103 వసతి గృహాన్ని పార్టీ కార్యకలాపాలకు అడ్డాగా మార్చాడు. అన్యమతస్తుడైన రజాక్ బినామి పేర్లతో టెండర్లు దక్కించుకుని సుమారు 20 సంవత్సరాలుగా పనులు చేస్తున్నాడు. గతంలో ఈ విషయమై పలు హిందూ సంఘాలు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన సందర్భాలు వున్నాయి. గత వైసీపీ పాలనలో తాను డీఎస్పీనంటూ శ్రీశైలానికి సరుకులు చేరవేసే ట్రాన్స్‌పోర్టు వారిని బెదిరించి మామూళ్లు వసూలు చేయడంతో, ఫోను సంభాషణ ద్వారా స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి రజాక్‌ను రిమాండుకు పంపారు. తాజాగా ఈ నెల 8వ తేదీన దేవస్థానం ఒప్పంద ఉద్యోగి గృహంలో మద్యం సేవిస్తూ పట్టుబడ్డాడు. అన్యమతస్తుడైన రజాక్ వల్ల క్షేత్ర పవిత్రతకు భంగం వాటిల్లడంతో ఏఈవో సాయి కుమారికి కేటాయించిన ఎంజీ 103 నివాస గృహాన్ని ఐదు రోజుల లోపల ఖాళీ చేసి దేవస్థానానికి అప్పగించాల్సిందిగా ఈవో ఎం. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదర్శ నేత దామోదరం సంజీవయ్య

- నిజాయితీకి మార్గదర్శకుడు
- కలెక్టర్ రంజిత్ బాషా
- ఘనంగా సంజీవయ్య 104వ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



దామోదరం సంజీవయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్





మాట్లాడుతున్న ఎంపీ ఎమ్మెల్యేలు బస్తిపాటి, గౌరు చరిత

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శ నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని కలెక్టర్ రంజిత్ బాషా కొనియాడారు. ఆయన ఒక వర్గం, మతానికే కాకుండా ప్రతి ఒక్కరికి మార్గదర్శకుడు, ఆదర్శప్రాయుడు అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కర్నూలు కలెక్టరేట్ నుంచి విద్యార్థులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాయత్రీ ఎస్టేట్, సీక్యాంప్ మీదుగా నంద్యాల చెక్‌పోస్ట్ వరకు సాగింది. అక్కడ దామోదరం సంజీవయ్య కూడలిలో సంజీవయ్య విగ్రహానికి కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ తులసిదేవి, దళిత, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ నీతికి, నిజాయితికి దామోదరం సంజీవయ్య ప్రతీకగా నిలిచారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ఉన్నత విద్యను అభ్యసించి, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఏఐసీసీలో ఉన్నత పదవులను ఆలంకరించారన్నారు. నిరుపేదలకు 6 లక్షల ఎకరాలను పంపిణీ చేశారన్నారు. కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయ్యంలో ఉద్యోగ,కార్మికులకు బోనస్ ఇచ్చి, బోనస్ మంత్రిగా పేరు తెచ్చుకున్నారని వివరించారు. కర్నూలు జిల్లాల్లో దామోదరం సంజీవయ్య పుట్టడం జిల్లాకే గర్వకారణం అన్నారు. కర్నూలుకు దామోదరం సంజీవయ్య పేరును ఏర్పాటు చేసేందుకుకు రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ రంజిత్ బాషా వివరించారు. ఆయన జీవిత చరిత్రను పుస్తకాల రూపంలో ముద్రించి పంపిణీ చేస్తామన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ వృద్ధులకు ఫించన్లు పంపిణీ చేసిన మొట్టమొదటి సీఎం దామోదరం సంజీవయ్య అన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ అట్టడుగు స్థాయిలో పుట్టి ఎన్నో ఉన్నత పదవులు చేపట్టారన్నారు. అవినీతి అధికారుల గుండెల్లో సింహ స్వప్నంగా వెలిగారన్నారు. అనంతరం జయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో దామోదరం సంజీవయ్య అన్న కుమారుడు దామోదరం రాధాకృష్ణ, సంజీవయ్య మేనల్లుడు ఎర్రమ పాండురంగయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, కాసారపు వెంకటేష్, టీఎస్ఎఫ్ చంద్రప్ప, నాయకులు వీరభద్రుడు, అనంతరత్నం, త్యాగరాజు, కైలాస్ నాయక్, సోమసుందరం, సామేల్, సామన్న, షేక్ అర్షద్, దూరదర్శన్ డైరెక్టర్ రంగస్వామి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు

- మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపించిన విషయం తెలిసిన వెంటనే ఆయన కలెక్టర్ రంజిత్ బాషాతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లు, బాతులను సక్రమంగా పూడ్చి పెట్టాలన్నారు. వ్యాధి వ్యాప్తిచెందకుండా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని కోరారు. బర్డ్‌ఫ్లూ నివారణపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటోందన్నారు.

బర్డ్ ఫ్లూతోనే బాతులు మృతి

- శాంపిల్స్‌లో పాజిటివ్ ఫలితాలు



జేడీ శ్రీనివాస్

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ కారణంగానే కర్నూలు నగరంలో బాతులు మృతి చెందినట్టు నిర్ధారణ అయిందని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. మృతి చెందిన బాతుల నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్‌కు శాంపుల్స్ పంపగా అక్కడి నుంచి బర్డ్‌ఫ్లూనకు సంబంధించిన పాజిటివ్ ఫలితాలు వచ్చాయని చెప్పారు. దీంతో కర్నూలు నగరంలోని ఎన్ఆర్‌పేటలో కిలోమీటరు వరకు రెడ్ అలర్ట్ ప్రకటించామని వివరించారు. పరిసర ప్రాంతాల్లోనూ వైరస్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రెడ్ అలర్ట్ జోన్‌లో 8 బృందాలు, సర్వే లైన్స్ జోన్‌లో మరి కొన్ని బృందాలతో బర్డ్‌ఫ్లూపై నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. బాతులు, కోళ్ల వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉడికించిన మాంసం, గుడ్లు తినవచ్చు: బర్డ్ ఫ్లూగా తేలిన ప్రాంతాల్లో వాటి అవశేషాలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి మట్టిలో పూడ్చాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని జేడీ స్పష్టం చేశారు. బర్డ్ ఫ్లూ వల్ల కోడి గుడ్లను బాగా ఉడికించి ఆహారంగా తీసుకోవచ్చని, నూరు డిగ్రీల ఉష్ణోగ్రతల్లో ఉడికిస్తే.. ఎలాంటి క్రిములు వాటిల్లో ఉండవని స్పష్టం చేశారు.

నేడు ఆకాశవాణి కర్నూలు కేంద్రంలో 'కిసాన్ దినోత్సవం'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి రోడ్డులోగల ఆకాశవాణి కర్నూలు కేంద్రంలో శనివారం ఉదయం 11 గంటలకు 'కిసాన్ దినోత్సవం' నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఆకాశవాణి కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ దేవరబొట్ల మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆకాశవాణి కేంద్రంలో ఏటా ఫిబ్రవరి 15న రేడియో కిసాన్ దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ నేపథ్యంలో 'కిసాన్‌వాణి' ప్రసారాల సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సాధికార సంస్థ, ఏపీ కమ్యూనిటీ మానేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ వి.లక్ష్మినాయక్, విశిష్ట అతిథిగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధికారి డాక్టర్ ఎం.జాన్సన్, గౌరవ అతిథులుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పీఎల్ వరలక్ష్మి, పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని రైతులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరై, వ్యవసాయ, సాంకేతిక విషయాలపట్ల అవగాహన కలిగించుకోవాలని సూచించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

మహానంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. ఎం.తిమ్మాపురంలోని కేజీబీవీని శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. వంట గదితో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రామసుబ్బయ్య పాల్గొన్నారు.

నంద్యాలలో జేఎన్టీయూ, కేంద్రీయ విశ్వవిద్యాలయం

మంత్రి ఫరూక్



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో జేఎన్టీయూ, కేంద్రీయ విశ్వవిద్యాలయతో పాటు జవహర్ నవోదయ విద్యాలయానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం తన స్వగృహంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల, గోస్పాడు మండలాల్లో విద్యాశాఖకు సంబంధించి పలు అపరిష్కృత పనుల పూర్తికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ప్రేమంత్ కుమార్, అస్మద్దిన్, బ్రహ్మం నాయక్, జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తిరుగు రథోత్సవం

కోడుమూరులో ఘనంగా కొనసాగుతున్న చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



భక్తుల కోలాహలం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జిలు

కోడుమూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోడుమూరు చౌడేశ్వరీదేవి తిరుగు రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే రథానికి పూజ కార్యక్రమాలను ముగిసిన అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుంచి తిరుగు రథోత్సవం నిర్వహించారు. తిరుగు రథోత్సవ వేడుకలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో పట్టణ పుర వీధులు జనంతో నిండిపోయాయి. సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు.

అలరించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్

చౌడేశ్వరిదేవి తిరుణాల సందర్భంగా మన ఊరు మన జాతర కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంత మార్కెట్లో శుక్రవారం రాత్రి చేపట్టిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ప్రజలను అలరించింది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ విద్యార్థులు నృత్య ప్రదర్శన ప్రజలను ఉత్తేజ పరిచింది. దేశ భక్తి, కూచిపూడి, భరతనాట్యంతో పాటు వివిధ సినిమా పాటలకు విద్యార్థులు వేసిన స్టెప్పులకు సంత మార్కెట్ మైదానం ఈళలు, చప్పట్లతో మార్మోగింది. వేదికపై మిమిక్రీ ఆరిస్టు ఉస్మాన్‌బాషా తన మిమిక్రీతో ప్రజలను కడుపుబ్బా నవ్వించారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు లాయర్ ప్రభాకర్, నాగేశ్వరరావు, బలరాం, నటరాజ్, మధు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన :

స్థానిక తేరుబజారులో శుక్రవారం ఉదయం నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళ నుంచి విశేష స్పందన వాటిల్లింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన ముగ్గురికి వెండి కుంకుమ భరిణిలను అందజేయనున్నారు.



గెలుపొందిన క్రికెట్ జట్టుకు కప్పును అందిస్తున్న డాక్టర్ రఘురామిరెడ్డి

ముగిసిన రాయలసీమ ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు :

గత రెండు రోజులుగా సాగిన రాయలసీమ జోన్ ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. పోటీలకు 32 టీంలు వచ్చాయి. రెండు రోజుల పాటు జరిగిన హోరాహోరీ పోటీల్లో అనంతరం జట్టు మొదటి స్థానంలో, నంద్యాల జట్టు రెండో స్థానంలో, మూడో స్థానంలో ఎమ్మిగనూరు, నాలుగో స్థానంలో కోడుమూరు జట్టు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు రూ.10వేలు, రూ.7500, రూ.5వేలు, రూ.3వేల నగదును అందించారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కోడుమూరు చౌడేశ్వరీ దేవి జాతర పురస్కరించుకొని ఈ నెల 3న ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. దాదాపు 11 రోజుల పాటు సాగిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 క్రికెట్ జట్లు వచ్చాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలల్లో చివరకు ఎమ్మిగనూరుకు చెందిన మహేంద్ర లెనిన్ టీం మొదటి బహుమతి రూ.50వేల నగదును గెలుచుకుంది. రెండో బహుమతి రూ.25 వేల నగదును కోడుమూరుకు చెందిన స్టార్ బాయ్స్ టీం, మూడో బహుమతి రూ.10 వేలను కోడుమూరుకు చెందిన అబిస్టార్ టీం గెలుచుకుంది. గెలుపొందిన టీంలకు బహుమతి దాతలు పాలవారి భాస్కర్‌రెడ్డి, సురేంద్ర, ఎ.యం ఆటోమొబైల్స్, 2004-2005 పూర్వ విద్యార్థులు నగదును అందజేశారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

గిడ్డంగుల సంస్థకు జవసత్వాలు

(5వ పేజీ తరువాయి)

● కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేనా..?

గత వైసీపీ పాలనలో సివిల్ సప్లయ్‌తో పాటు మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, నాఫెడ్ సంస్థలు బియ్యం, ఇతర పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధీనంలోని గోదాములకు ప్రాధాన్యత ఇవ్వకుండా వైసీపీ నేతల కనుసన్నల్లో ఉన్న గోదాములకే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ కారణంగానే రైతుల పంట ఉత్పత్తులు, అదేవిధంగా బియ్యం పక్కదారి పట్టాయి. భారీ ఎత్తున ప్రభుత్వానికి నష్టం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతోనే ఈ అక్రమాలన్నీ వెలుగు చూశాయి. ఇకపై సివిల్ సప్లయ్‌కు చెందిన బియ్యం ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లోనే నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ సంస్థ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్‌డబ్ల్యూసీ సంస్థ అధికారులు తెలిపారు. అయితే.. సివిల్ సప్లయ్ సంస్థ ఉన్నతాధికారులు కొందరు వైసీపీ నేతల ఆదేశాలనే ఇంకా పాటిస్తూ వస్తుండటంతో ఎస్‌డబ్ల్యూసీ అధికారుల్లో ఆందోళన మొదలైంది. కర్నూలు నగరంలోని రేడియో స్టేషన్ వద్ద 6 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేస్తామని చెప్పిన సివిల్ సంస్థ అధికారులు ఇప్పుడు మళ్లీ కుంటి సాకులతో ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో బియ్యం నిల్వ చేయకుండా ప్రభుత్వానికి వివిధ కారణాలు చెప్పినట్లు విశ్వసనీయం సమాచారం అందింది.




● కాగితాలకే నోడల్ ఏజెన్సీగా ఎస్‌డబ్ల్యూసీ సంస్థ:

జగన్ తెచ్చిన జీవో 565 ప్రకారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నోడల్ ఏజెన్సీగా పని చేయాలి. సివిల్ సప్లయ్, మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థలకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను సమకూర్చి గోదాముల్లో నిల్వ చేయాలి. అయితే గత ఐదేళ్లుగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నోడల్ ఏజెన్సీగా పని చేసిన దాఖలా లేదు. వైసీపీ ప్రభుత్వం తమ సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆ సంస్థ అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రభుత్వ హయాంలో మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్ తదితర సంస్థలు బియ్యం, కందులు, మొక్కజొన్న మొదలైన వాటిని కొనుగోలు చేసి అవసరమైన గోదాములను ఏర్పాటు చేసే బాధ్యతను రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఏర్పాటైన అధికారుల కమిటీకి ఏ మాత్రం అధికారాలు లేకుండా చేశారనే ఆరోపణ ఉంది. దీంతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కాగితాల్లోనే నోడల్ ఏజెన్సీగా మిగిలిపోయిందని ఆ సంస్థ అధికారులు చెబుతున్నారు.

● కూటమి ప్రభుత్వంతో ఎస్‌డబ్ల్యూసీకి జవసత్వాలు:

గత వైసీపీ ప్రభుత్వంలో అలంకార ప్రాయంగా ఉండిపోయిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కూటమి పాలనలో మళ్లీ బలోపేతమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా సివిల్ సప్లయ్ అధికారులు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములు బియ్యం నిల్వ చేసేందుకు ఏ మాత్రం పనికిరావని ప్రభుత్వానికి నివేదిక పంపడమే కాకుండా ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉన్న గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేసేందుకు అనుకూలమని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆనాటి అధికార పార్టీలోని పెద్దల వత్తాసుతో బియ్యం నిల్వలు ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలోని గోదాముల్లోకి చేర్చారు. ఈ కొత్త నిర్ణయంతో ఆ పార్టీ నేతలు, వారి అనుచరులు రూ.కోట్లు దండుకోవడంపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ దురాగతాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం మళ్లీ ఎస్‌డబ్ల్యూసీ సంస్థకు జవసత్వాలు కల్పించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఆ సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 40 వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసేందుకు ఎస్‌డబ్ల్యూసీ సంస్థకు గోదాములు ఉన్నాయి. సివిల్ సప్లయ్ అధికారులు ఈ గోదాములు పనికి రావని, కుంటి సాకులు చెప్పడంతో ఆ గోదాముల్లో బియ్యం నిల్వ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ గోదాములకు మళ్లీ మహర్దశ పట్టనుంది. ఎస్‌డబ్ల్యూసీ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసరాల వస్తువులను నిల్వ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఆ సంస్థ ఉన్నతాధికారులు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌డబ్ల్యూసీ గోదాములు ఎంత మేర శిథిలావస్థకు చేరాయో గుర్తించి వాటి మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం.

● ఎస్‌డబ్ల్యూసీ గోదాములకు మహర్దశ కల్పిస్తాం



ఎస్‌డబ్ల్యూసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సంస్థ ఆధ్వర్యంలో ఉన్న గోదాములను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతాం. గోదాముల మరమ్మతులకు నిధులు ఎంత అవసరమో గుర్తించి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నాం. మా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసర వస్తువులు మా గోదాముల్లో నిల్వ చేసేలా కార్యాచరణ ప్రణాళిక తయారవుతుంది.

- షాకీర్ హుసేన్, రీజనల్ మేనేజర్

వంద రోజుల పని కల్పించండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 30వేల కుటుంబాలకు వంద రోజులు పనులు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఉపాధి హామీ పథకం, గ్రామ వార్డు సచివాలయాల కార్యక్రమాలు, స్వచ్ఛతా దివస్ అంశాలపై నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు మున్సిపల్ కమిషనర్లు ఎపీడీలు, ఎంపీడీవోలు ఏపీవోలు, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించడంలో ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆదోని, నందవరం, ఎమ్మిగనూరు, కోసిగి, కృష్ణగిరి పెద్దకడుబూరు గోనెగండ్ల, మండలాలు 70 శాతంలోపు మాత్రమే పనిదినాలు కల్పించారన్నారు. గోకులాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జీఎస్ డబ్ల్యూఎస్‌కి సంబంధించి హౌస్ హోల్డ్ జియో కోఆర్డినేట్లు చేయడంలో కౌతాళం, ఆదోని అర్బన్, ఆదోని రూరల్, కర్నూలు అర్బన్ ఎమ్మిగనూరు అర్బన్‌లో చాలా పెండింగ్ ఉన్నాయన్నారు. అంగన్‌వాడీలో ఉన్నటువంటి 0-6 ఏళ్ల పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంటు చేయడంలో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. రేపు మూడో శనివారం సందర్భంగా జిల్లా అంతటా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాల న్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

రేపు నరసం 7వ రాష్ట్ర సదస్సు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర సదస్సు ఆదివారం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు కేవీ సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి తెలిపారు. శుక్రవారం నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగుభాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, ఎం.లక్ష్మయ్య, నరసం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, కార్యదర్శి పసుపులేటి నీలిమ తదితరులు హాజరై నరసం 7వ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీ సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ రాష్ట్ర సభలు వివిధ సెషన్లలో కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవయిత్రులు, రచయిత్రులు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఏటా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక రుగ్మతలు, మహిళా సమస్యల పరిష్కార సాధనకు చైతన్యం తీసుకు వస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 7వ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సులో పుస్తక ప్రదర్శనలు, పుస్తక ఆవిష్కరణలు, కవి సమ్మేళనాలు, వివిధ అంశాలపై చర్చాగోష్ఠులు ఉంటాయని వివరించారు. ఉమ్మడి జిల్లాలోని సాహిత్యాభిలాషులైన మహిళలు ఈ సదస్సునకు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.



రాష్ట్ర సదస్సు పోస్టర్లు విడుదల చేస్తున్న నరసం ప్రతినిధులు

రైతులకు పింఛన్!

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేడీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రధాన మంత్రి కిసాన్ మారథాన్ యోజనా పథకం రైతుల కోసం అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు కొంత మొత్తాన్ని బ్యాంకులో చెల్లిస్తే అందుకు మూడు రెట్లు ప్రభుత్వం కలిపి ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ ఇస్తుందని స్పష్టం చేశారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకా న్ని అమలులోకి తెచ్చిందని, చిన్న, సన్నకారు రైతులను ఆర్థికం గా ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకం అమలవుతుందని తెలిపారు. పథకంలో చేరిన రైతు మరణిస్తే అతని భార్యకు ప్రతి నెలా రూ.1,500 పింఛన్ అందుతుందని వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్ www.pmkmy.gov.in ద్వారా అప్లయ్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

కర్నూలు డీసీసీ అధ్యక్షుడిపై వేటు..!

- సస్పెండ్ చేస్తూ ఏపీసీసీ ప్రకటన
- నిర్ణయాన్ని శిరసావహిస్తా : మురళీకృష్ణ



కాంగ్రెస్ పార్టీ కార్యాలయం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


వారం రోజులుగా జరుగుతున్న సంఘటనలో భాగంగా అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని శిరసావహిస్తానని మాజీ డీసీసీ అధ్యక్షుడు పి.మురళీ కృష్ణ వెల్లడించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తాను తప్పుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఇన్నాళ్లూ విజయవంతంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ అభివృద్ధికి కృషి చేశానని ప్రకటనలో తెలిపారు.

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పి.మురళీకృష్ణను ఏపీసీసీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల తొలగించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన్ను జిల్లా అధ్యక్ష స్థానం నుంచి తొలగిస్తూ నోట్ జారీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం భవనం పేరుతో సొసైటీ ఏర్పాటు చేయడంతో పాటు పలు ఆరోపణలతో పార్టీ సీనియర్ నాయకులు ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ఏపీ పీసీసీ కార్యాలయం వెంటనే స్పందించి జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించింది. రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకుని సొసైటీని కూడా రద్దు చేయించింది. సీడబ్ల్యూసీ ప్రత్యేక సభ్యుడు గిడుగు రుద్రరాజును జరిగిన ఘటనపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు జరిగిన సంఘటన వాస్తవ మేనని, డీసీసీ అధ్యక్షుడితో పాటు కమిటీలోని సభ్యులు కూడా ఇం దుకు బాధ్యులేనని, వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవస రం ఉందని పార్టీ హైక మాండ్‌కు నివే దిక ఇచ్చారు. స్పం దించిన పీసీసీ అధ్య క్షురాలు వైఎస్ షర్మి ల శుక్రవారం ముర ళీకృష్ణను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఆదే శించారు. ఆదేశాలు వెలువడిన వెంటనే కార్యాల యంలో నగర అధ్యక్షుడు జిలానీ బాషా నాయ కత్వంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.బాబు రావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బ్రతుకన్న, లాజరస్, అనంతరత్నం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరైనా కాంగ్రెస్ పార్టీ ఆస్తుల జోలికి వస్తే ఇదే గతి పడుతుందని హెచ్చ రించారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఐక్యంగా పోరాటాలు చేసి పార్టీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

తపాలా శాఖను ప్రైవేటుపరం చేయకండి

- జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన


హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖను ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదని తపాలా శాఖ జేఏసీ హెచ్చరించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రధాన తపాలా కార్యలయం ఎదుట ఎన్ఎన్‌పీసీ, ఎఫ్ఎన్‌పీఓ, ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూ జీడీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తపాలా ఉద్యోగుల పీ4 రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ తపాలా శాఖను మూడు ముక్కలుగా చీల్చి ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు అంటగట్టే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ప్రైవేటు పరం చేస్తే 150 సంవత్సరాల తపాలా శాఖ ఉనికి కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పీ3 కార్యదర్శి గిరిబాబు, పీ4 సెక్రటరీ మహ్మద్‌జానీ, సుమంత్, శివకుమార్ రెడ్డి, బి.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వేధిస్తున్నారు

- సెల్ఫీ వీడియోతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


పురుగుల మందు డబ్బాతో చిన్నపుల్లయ్య

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులతో టీడీపీ నాయకులు తనను వేధిస్తున్నారని ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆత్మకూరు మండలంలో జరిగింది. చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట మలుపు వద్ద శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు డబ్బాతో సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు లింగారెడ్డి, వరకంచి శంకరన్న, మద్దినేని శివకృష్ణ, మద్దినేని శివుడు, మద్దినేని నవీన్ తన ఆత్మహత్యకు కారణమని సెల్ఫీ వీడియోలో చెప్పారు. వైసీపీకి అనుకూలంగా పని చేయడంతో టీడీపీ నాయకులు అక్రమ కేసులతో తనను వేధిస్తున్నారంటూ పురుగుల మందు తాగారు. సమాచారం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నపుల్లయ్యను హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఆత్మకూరు అర్బన్ సీఐ రామును వివరణ కోరగా.. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు వాంగ్మూలం ఇవ్వలేని పరిస్థితుల కారణంగా కేసు నమోదు చేయలేదని చెప్పారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు. గురువారం ఎరువుల పంపిణీలో చోటు చేసుకున్న వివాదంపై పోలీసులు చిన్నపుల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీంతో ఏ తప్పు చేయనప్పటికీ తనపై అక్రమ కేసులను బనాయించడం వల్లే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు


డీఎస్పీ అంత్యక్రియల్లో ఫైరింగ్ చేస్తున్న పోలీసులు

ఆస్పరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో డీఎస్పీగా పనిచేస్తూ అనుమానాస్పదంగా మృతి చెందిన బి.నాగరాజు అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం ఆస్పరిలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో నలుగురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు మస్తాన్‌వలి, పోలీసు సిబ్బంది అంత్యక్రియలో పాల్గొన్నారు. రౌండ్లు పేల్చి నివాళి అర్పించారు.

చిరుతపులి దాడిలో గొర్రెలు మృతి

పాణ్యం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్ట సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని అడవిలో గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసినట్లు గొర్రెల కాపరి వడితే భీమానాయక్ తెలిపారు. శుక్రవారం గొర్రెలను మేపడానికి అటవీ ప్రాంతంలోకి వెళ్లగా హఠాత్తుగా చిరుతపులి గొర్రెల మందపై దాడి చేసి రెండు గొర్రెలను చంపినట్లు తెలిపారు. మూడు గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. దాడి సమయంలో భయపడి కేకలు వేయడంతో చిరుతపులి గొర్రెలను విడిచి పారిపోయినట్లు తెలిపారు. వివరణ కోసం ఎఫ్ఆర్‌వో సుబ్బారాయుడును ఫోన్ ద్వారా ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


గాయపడిన గొర్రెలతో కాపరి

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామక్క అనే వృద్ధురాలు శుక్రవారం మృతి చెందినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు. జోళదరాశి గ్రామానికి చెందిన రామక్క గురువారం (90) కోవెలకుంట్ల నుంచి సంత మార్కెట్ మీదుగా సౌదరిదిన్నెకు నడుచుకుంటూ వెళ్తోంది. కోవెలకుంట్ల నుండి బైకుపై ముల్లహుసేన్‌బాషా అనే వ్యక్తి బైకుపై వెళుతూ సంత మార్కెట్ వద్ద రామక్కను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించి అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

- వ్యక్తిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పొలం రస్తా విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. శుక్రవారం ఎస్ఐ భూపాలుడు తెలిపిన ప్రకారం.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి చిన్నకొప్పెర్లలో పొలం ఉంది. ఆ పొలాన్ని వెలగటూరుకు చెందిన రామచం ద్రుడు కౌలుకు తీసుకున్నాడు. అలాగే గోవిందిన్నె గ్రామానికి చెందిన రమేష్ రెడ్డికి కూడా చిన్నకొప్పెర్ల గ్రామంలో ప్రసాద్ పొలం పక్కనే పొలం ఉంది. శుక్రవారం రామచంద్రుడు, రమేష్ రెడ్డిలు పొలం రస్తా విషయంలో ఘర్షణ పడ్డారు. రామచంద్రుడుపై రమేష్ రెడ్డి దాడి చేశాడు. రామచంద్రుడుకు గాయాలు కావడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రమేష్ రెడ్డిపై కేసు నమోదైంది.

కళ్లను సంరక్షించుకోవాలి: మంత్రి


విద్యార్థినికి కళ్లజోడు పెడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లను అధికంగా వినియోగించి కంటి చూపునకు దూరమవుతున్నారని, ఆటపాటలు, చదువు మీద ఏకాగ్రతతో చూపును సంరక్షించుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. నంద్యాల క్రాంతినగర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం కంటి అద్దాల పంపిణీ నిర్వహించారు. మంత్రితో పాటు కలెక్టర్ రాజకుమారి, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, డా.మాధవీలత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డా.సిసిలియా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 19.60 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలున్న వారికి ప్రభుత్వం కళ్లద్దాలు పంపిణీ చేస్తోందన్నారు. 90వేలమంది విద్యార్థులకు కళ్లద్దాలు ఇవ్వాలని వైద్యులు సూచించారని, అందుకు ప్రభుత్వం రూ.2.5 కోట్లు వెచ్చించి విద్యార్థులకు అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా ఎ-విటమిన్ గల ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో కంటి సమస్యలున్న 44మంది విద్యార్థులకు మంత్రి ఫరూక్, కలెక్టర్‌లు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన రాజ్య పురస్కార్ టెస్టింగ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాపు శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి 16 నవోదయ విద్యాలయాల నుంచి స్కౌట్స్, గైడ్స్ 91, గైడ్స్ విద్యార్థులు 108 మంది హాజరయ్యారు. చివరి రోజు ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నవోదయ విద్యాలయాల్లో చదవడం ఓ అదృష్టమని, ఇక్కడ చదివిన విద్యార్థులు గొప్పస్థాయిలో ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని భాషలపై పట్టు పెంచుకోవచ్చని తెలిపారు. విద్యాలయంలోని గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, శ్రీనివాసరావు, వెంకటేష్, బాబురావు నింబురే, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 13 మంది పోలీస్ సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీకి విన్నవించుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. విధి నిర్వహణలో సతమత మవకుండా ప్రజలకు సేవలందించేలా చేయడమే లక్ష్యమని చెప్పారు.

నిమిషాల్లోనే నేరస్తుల చిట్టా

అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు


పరికరాలను అందజేస్తున్న ఎస్పీ


పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇక నిమిషాల్లోనే నేరస్తుల చిట్టా విప్పేయవచ్చు. క్షణాల్లోనే నేరస్తుల వేలిముద్రలతో వారి బాగోతం బయటపెట్టవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. శుక్రవారం సీఐడీలోని ఫింగర్ ప్రింట్స్ బ్యూరో విభాగం నుంచి కర్నూలుకు ఐదు ఫింగర్ ప్రింట్స్ లైవ్ స్కానర్స్, 8 మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ పరికరాలు వచ్చాయి. ఈ పరికరాల పని తీరును ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి వాటి వినియోగంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దొంగల ఆటకట్టించేందుకు, నేరాల కట్టడికి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పోలీసులు వినియోగించే విధంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరస్తులు, అనుమానితుల వేలిముద్రలను వేగంగా కచ్చితత్వంగా సేకరిస్తామన్నారు.

డిజిటల్‌గా వేలిముద్రలను భద్రత పరచాలి:

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రాత్రి, పగలు సమ యాల్లో, జాతరలు, ఉత్సవాలు, బందోబస్తు, అనుమానిత ప్రాంతాలు, గస్తీ విధులలో ఉన్న పోలీసులు అనుమా నితులను ఆరా తీసి వారి వేలిముద్రలను సేకరించాలని సూచించారు. ఇదివరకే దొంగతనాలకు పాల్పడిన వారి నేరాల వివరాలు, ఫొటోలు వేలిముద్రలు ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచామన్నారు. వీరు భవిష్యత్తులో ఎక్కడైనా ఎలాంటి నేరానికి పాల్పడినా వేలిముద్రల సాయంతో వెంట నే దొరికే అవకాశం ఉందన్నారు. సేకరించిన వేలిముద్రలను సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేయాలన్నారు. అనుమా నితులను ఆరా తీయడంలో విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్తులు కొత్త పద్ధతుల్లో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజోమూర్తి, ఫింగర్ ప్రింట్ సీఐ పవన్ కుమార్ రెడ్డి, పత్తికొండ సీఐ జయన్న, ఎమ్మిగనూరు సీఐ శ్రీనివాసులు, ఆలూరు సీఐ వెంకట చలపతి ఉన్నారు.

వైద్య వృత్తిలో క్యారెక్టర్ అవసరం

- సీటీవీఎస్ విభాగాధిపతి డా.సి.ప్రభాకర్ రెడ్డి
- ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్యులకు ఎథిక్స్‌పై అవగాహన



కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి వైద్యుడు రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని, వైద్య వృత్తిలో క్యారెక్టర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని కార్డియోథొరాసిక్ విభాగపు హెచ్‌వోడీ, సీనియర్ ప్రొఫెసర్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎథిక్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇంటర్నెట్ యుగంలో ప్రతి ఒక్కరూ చదువుకున్న వారేనని, ఏదైనా అనారోగ్య సమస్యతో వైద్యుల దగ్గరకు వస్తారని, విసుగుకోకుండా వైద్యం అందించాలన్నారు. డబ్బులకు ఆశపడి దొంగ సర్టిఫికెట్లు ఇవ్వరాదని, దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. ప్రతి వైద్యుడు ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ విధిగా చేసుకోవాలని సూచించారు. వైద్యుడు ప్రిస్క్రిప్షన్‌లో మందు పేరు రాయాలని, కంపెనీ పేరు రాయకూడదని అన్నారు. రోగి తన వైద్యసేవల రికార్డును పొందే హక్కు ఉంటుందని, రోగి అడిగిన 72 గంటలలోపు అతనికి రికార్డు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

కేవీకేలో నైపుణ్య ఆధారిత ఇంటర్న్‌షిప్


శిక్షణకు హాజరైన అభ్యర్థులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సింజెంట్ ఫౌండేషన్‌ఔ, జాతీయ వ్యవసాయ పరిశోధన మార్కెటింగ్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న నైపుణ్య ఆధారిత ఇంటర్న్‌షిప్‌ను సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమం 40 రోజుల పాటు జరుగుతుందన్నారు. అభ్యర్థులకు స్టైఫండ్‌తో పాటు23 రోజుల పాటు క్లాస్‌రూం ప్రోగ్రామ్ ఉంటుందని, తర్వాత రెండు నెలల పాటు ఫీల్డ్‌లెవెల్ ట్రైనింగ్ ఉంటుందన్నారు. శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సింజెంటా కంపెనీలో మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిజెంటా ట్రైనీ అసోసియేట్ శివరామరాజు పాల్గొన్నారు.

'ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి'



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీజీబీ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండడానికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకుడు రమణారెడ్డి, సీఐటీయూ నాయకులు విజయ్, సాయిబాబా, ప్రభాకర్, మహమూద్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయలో జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోలు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మన్న, జాన్‌బాబు, ఎల్లప్ప పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ రాజు శత వర్ధంతి జాతాను ఈనెల 22, 23న విశాఖలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి శుక్రవారం ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షులు రామశేషయ్య, అధ్యాపకులు హేమంత్, సత్యనారాయణ, మల్లేష్, గోపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమ సందర్శన

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ పరిశ్రమను శుక్రవారం సందర్శించారు. సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలల విద్యార్థులు కంపెనీలో తయారు చేసే కాస్టిక్ సోడా, క్లోరిన్, హైడ్రోజన్, హైపో తదితర రసాయనాల తయారీ గురించి కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. డీన్ డాక్టర్ నాగేంద్రశెట్టి, అధ్యాపకులు బాలరాజు, అనూష, వెంకటన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని 24వ వార్డు సీపీఎం కార్యదర్శి లీలావతి డిమాండ్ చేశారు. శుక్రవారం 60వ సచివాలయం ఎదుట ధర్నా చేసి కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారమే రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, చందు, రత్నమ్మ, రమేష్ పాల్గొన్నారు.

పుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్ గురువారం నిర్వహించారు. ఈసమావేశానికి కర్నూలు జి.పుల్లయ్య కాలేజీ ఎంబీఏ విద్యార్థులు హాజరై ప్రతిభను చాటి బహుమతులు కైవసం చేసుకున్నారు. శుక్రవారం కాలేజీ మేనేజ్మెంట్ నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ సి.శ్రీనివాసరావు, డీన్ జి.శశికుమార్ ఎంబీఏ విభాగాధిపతి డా.సి.నాగ గణేష్ విద్యార్థులను అభినందించారు.

వెంకటగిరిలో బయటపడ్డ గొయ్యి



గొయ్యి చూపుతున్న అయ్యన్న

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఇళ్ల మధ్య సుమారు 10 అడుగులకు పైగా లో తైన గొయ్యి బయటపడింది. వివరాలివి.. స్థానికంగా గిడ్డాంజనేయ స్వామి ఆలయ సమీపాన గిడ్డయ్య, అయ్యన్న ఇళ్ల మధ్య గొయ్యి ఏర్ప డింది. ఇంటి ముందు వెళ్లిన డ్రైనేజీ కాలువ నుంచి నీళ్ల కదలకపో వడంతో యజమానులు పరిశీలించగా డ్రైనేజీ మధ్య చీలిక ఏర్పడి అం దులోకి నీళ్లు జారిపోతున్నాయి. దీంతో ఎగువన డ్రైనేజీ నీటిని మరోవైపు మళ్లించారు. డ్రైనేజీలో ఏర్పడ్డ చీలికను మరమ్మతు చేయాలని ప్రయత్నించగా, ఇంటి అరుగు గోడ రాళ్లు కిందికి జారిపోయాయి. ఆ ప్రదేశంలో ఏర్పడ్డ రంధ్రం నుంచి చూడగా లోపల గొయ్యి కనిపించింది. అరుగు గోడ ఆనుకుని ఏర్పడ్డ గొయ్యి సీసీ రహదారి కిందకూ విస్తరిం చిందని యజమానులు తెలిపారు. సుమారు ఇరవై ఐదేళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకున్నామని, అప్పటికే ఉన్న అరుగులు తొలగించలేదని అన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీపీఐ




మాట్లాడుతున్న గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ కూలీలు పనుల్లేక వలసలు వెళ్తున్నారని అన్నారు. 45 రోజులుగా పని చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.22 కోట్లు బకాయిలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారని అన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, ప్రజానా ట్యమం డలి జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి అల్లీహుస్సేన్ ఉరుసు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో ఆదివారం నుంచి సద్గురు అల్లీహుస్సేన్ స్వామి ఉరుసు జరుగుతుందని పీఠాధిపతి అబ్దుల్‌సలాం స్వామి తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఈనెల 16న గంధం, 17న ఉరుసు, 18న కిస్తీలు జరుగుతాయని అన్నారు. అయ్యకొండ పీఠాధిపతి అధ్వర్యంలో గంధ వేడుకలు జరగనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఉపన్యాసాలు, భజనలు, నిర్వహిస్తున్నట్లు వివరించారు.



అల్లీహుస్సేన్ స్వామి దర్గా



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



సంజీవయ్య కుమారుడిని సత్కరిస్తున్న కలెక్టర్



నివాళి అర్పిస్తున్న జడ్పీ సీఈవో, అధికారులు

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ తులసిదేవి, యోగేష్ నాయక్ పాల్గొన్నారు.

కర్నూలు క్రైం: నిజాయితీకి మారుపేరు దామోదరం సంజీవయ్య అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కర్నూలు నగరంలో కలెక్టరేట్ నుంచి విద్యార్థులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల చెక్ పోస్ట్ వద్ద దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ భాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. సంజీవయ్య అన్న కుమారుడు దామోదరం రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దామోదరం సంజీవయ్యపై గుర్రం జాషువా రచించిన పద్యాలను సంజీవయ్య మేనల్లుడు, రిటైర్డ్ హెచ్ఎం ఎర్రమ పాండురంగయ్య ఆలపించారు.

● స్థానిక బీక్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం దామోదరం సంజీవయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు సరస్వతమ్మ, సి.మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, బసవశేఖర్, పుల్లయ్య, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌ఓ జునైద్, అకౌంట్స్ ఆఫీసర్ చండీప్రసాద్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వచ్ఛ భారత్ రచ్చబండ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాతబస్టాండు సమితి కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కాంగ్రెస్ కార్యాలయం దగ్గర ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు నాగరాజు, సుధాకర్ బాబు, గిరిధర్, రంగముని పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎన్‌సీ బజారన్న, లాజరస్, షేక్ ఖాజా హుస్సేన్, ఎస్ ప్రమీల, వెంకట సుజాత పాల్గొన్నారు.

● క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి దామోదరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ జే.హేమంత్, సత్యనారాయణ, మాదన్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్‌లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజు పాల్గొన్నారు.

● ఎస్సీఎస్టీబీసీ మైనార్టీ హక్కుల ఐక్య వేదిక కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ, పద్మావతి, షేకున్ బీ పాల్గొన్నారు.

కర్నూలు లీగల్: నేషనల్ లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ సమీపంలో ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లాయర్స్ ఫోరం అధ్యక్షుడు వై.జయరాజు, న్యాయవాదులు, మాదన్న, బి.చిన్నయ్య, మాసిపోగు సుబ్బయ్య, జాన్‌బాబు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ అధికారులు, ఆర్ఐ పాణ్యం శ్రీనివాసులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమిషనర్



ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో..



జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ..



నేషనల్ లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో..



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్





హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న సంజీవయ్య మేనల్లుడు పాండురంగయ్య

కాంగ్రెస్ ఆస్తుల కబ్జాను అధిష్ఠానం గుర్తించింది

డీసీసీని తొలగించడం హర్షించదగ్గ విషయం

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆస్తుల కబ్జాను అధిష్ఠానం గుర్తించిందని, ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణను పదవి నుంచి తొలగించిందని నగర అధ్యక్షుడు జిలాని బాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి గత పెద్దలు పార్టీ భవిష్యత్తును పరిగణలోకి తీసుకుని ఆస్తులు కూడబెడితే వాటిని కాజేసేందుకు గత డీసీసీ అధ్యక్షుడు ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న మాట్లాడుతూ గత డీసీసీ అక్రమాలపై పోరా టానికి జిల్లాలోని 6 నియోజకవర్గాల నుంచి నాయకులు స్పందించకపోవడం దారుణమన్నారు. మాజీ డీసీసీ కే బాబురావు మాట్లాడుతూ అధిష్ఠానం పార్టీ బాధ్యతలు అప్పగిస్తే ఇలా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతరత్నం మాదిగ, లాజరస్, ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐలమ్మ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీసీల శాతం ఎక్కువగా ఉన్న బీసీ కార్పొరేషన్ ద్వారా 1673 మందికి మాత్రమే రుణాలు ఇస్తామని అధికారులు లక్ష్యాలు విధించడం అన్యాయమన్నారు. నాయకులు ముక్కన్న, శేషాద్రి, రాముడు, శేఖర్‌బాబు, సుంకన్న పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కృషి: కమిషనర్



ఏవీ రమేష్ బాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో గూడూరు నగర అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఏవీ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా ఏవీ రమేష్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్‌ను టీడీపీ నాయకులు సృజన్, రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రేమట సురేష్, బుడ్డంగలి, విజయ్ కుమార్, వీరేంద్రలు కలిసి సన్మానించారు.

నెట్‌బాల్ పోటీలకు కీడాకారుల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు కర్నూలు జిల్లా ఆర్.కొంతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయులు సావిత్రి పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కీరడాకారులు యేసురాజు, మహేష్‌లు జూనియర్ నెట్‌బల్ బాలుర జట్టుకు ఎంపికైనట్లు వారు తెలిపారు. వీరు 15, 16 తేదీల్లో రావులపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

గూడూరు ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం గూడూరులోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు భూ సమస్య లపై ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ అధికారులు రైతులను కార్యాలయాల చుట్టు తిప్పుకోకుండా భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే నియోజకవర్గంలో వలసల నివారణపై అధికార యంత్రాగం దృష్టి సారించాలన్నారు. బర్డ్ ఫ్లూపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సి అవసరం లేదని ప్రభుత్వం అన్ని రకాలు గా చర్యలు తీసుకుంటుందన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవా లన్నారు. పశువులు, గొర్రెలు గ్రామాల్లో నీటి వసతి ఉన్న చోట తొట్లు ఏర్పాటు చేయాలన్నారు. పది పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమా వేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివనాగప్రసాద్, పరిపాలనాధికారి విజయసింహారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

●ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన టీడీపీ నాయకులు: మండల సమావేశంలో పాల్గొనేందుకు గూడూరుకు వచ్చిన కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరికిటీడీపీ నాయకులు పూలమాలలతో స్వాగతం పలి కారు. టీడీపీ నాయకులు కె.రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయు డు, సృజన్, రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రేమట సురేష్, బుడ్డంగలి, పి రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలి



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి

సి.బెళగల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు రైతులు సూచించారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని పండ్లతోటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవోలు చెంచురాజు, భాస్కర్, రైతులు ఉన్నారు.

వాల్మీకుల ఉద్యమం మరింత ఉధృతం

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం వాల్మీకుల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మొలగవల్లి రామాంజనేయులు, రాష్ట్ర కమిటీ నాయకులు టి.మురళి నాయుడు, కాశీం నాయుడు డా.రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం నగరంలో వీఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో వాల్మీకులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదం పొందేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

కర్నూలు మార్కెట్ యార్డులో వైద్యశిబిరం

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో జిల్లా న్యాయ సేవ సంస్థ తరఫున కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యం లో రైతులు, హమాలీలకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ రైతులు, హమాలీలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం హమాలీలకు డిప్యూటీ లేబర్ కమిషనర్ ఈ-శ్రామిక్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలి



సమావేశంలో పాల్గొన్న బేడ బుడగ సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాలకు ఎస్సీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ అన్నారు. శుక్రవారం ఏ.క్యాంపులోని హార్ట్ ఫౌండేషన్‌లో బేడ బుడగ జంగాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా బేడ బుడగ జంగాలకు ఎస్సీ రిజర్వేషన్ పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో భార్గవ్, తాటికొండ కొండయ్య, సిరిశిల అంజి, కొండపల్లి గోకారి, ఈబూది గోవిందు, జమ్మన్న, కొండప్పల్లి పెద్దయ్య, రుద్రాక్షలు, దస్తగిరి, అగుస్త లింగన్న, కళ్యాణం, లింగమయ్య పాల్గొన్నారు.

50 ఏళ్ల మహిళకు కిడ్నీ సమస్య

సర్జరీ చేసిన కిమ్స్ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన 50 ఏళ్ల లక్ష్మీదేవికి పుట్టుకతోనే కిడ్నీలు గుర్రపునాడా ఆకారంలో ఏర్పడ్డాయి. కానీ కొంత కాలంగా ఆమె తీవ్రమైన కడుపు నొప్పి జ్వరం లాం టి సమస్యలతో బాధపడుతూ జనవరి 21న కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చిం ది. సీనియర్ యురాలజిస్టు డాక్టర్ వై.మనోజ్ కుమార్ రోగికి పరీక్షలు చేయగా.. ఆమెకు గుర్రపునాడ కిడ్నీలలో కుడి వైపుది బాగా వాచిపోయి మెత్తబడ్డాయి. పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. కిడ్నీ సైజు బాగా పెరిగిపోవడంతో ఎడమ వైపు ఉన్న కిడ్నీలో కలిసిపోయింది. ఈ కేసును రోగి వయస్సు దృష్ట్యా డాక్టర్ మనోజ్‌కుమార్ ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసి దాదాపు 2 గంటలు శ్రమించి కిడ్నీని జాగ్రత్తగా తొలగించారు. అనంతరం రోగి ఆరోగ్యవంతంగా కోలుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి 600 మందిలో ఇది ఒకరికి మాత్రమే ఇలా ఉంటుందని, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో నిర్వహించడం వల్ల రోగి త్వరగా కోలుకుందన్నారు.

పైసలిస్తేనే పని..

- ఆలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంతే.. • విసిగిపోతున్న జనం



ఆలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటు ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముడుపులు ఇవ్వకపోతే ఏదో ఓ సాకుతో అధికారులు పెండింగ్ పెడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. డబ్బులు ఇస్తే గుట్టుచప్పుడు కాకుండా చక్కపెట్టేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేక..

మూడు నెలల క్రితం సబ్ రిజిస్ట్రార్ బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెగ్యులర్ రిజిస్ట్రార్ లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. ఇంకేముంది సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. బ్యాంకు రుణాలు పొందేందుకు స్పెషల్ అడిషనల్ స్టాంప్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు పత్తికొండ, ఆదోనికి వెళ్లి తెచ్చుకోవాల్సివస్తుంది.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల మకాం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మకాం వేసినట్లు తెలుస్తోంది. వీరి పనులు మాత్రం చకచకా అయిపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో ఏసీబీ దాడులు

గతంలో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. అయినా ఇక్కడ అవినీతి ఆగడం లేదు. జిల్లా అధికారులు స్పందించి, రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ నియమించి కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమర్పించుకుంటేనే పని..

మీసేవ కేంద్రాల్లో ఈసీలు రావడం లేదు. దీంతో ప్రజలు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వస్తున్నారు. ముడుపులు సమర్పించుకుంటేనే పని అవుతోందని ఆరోపణలు వినిస్తున్నాయి. కోయనగర్‌కు చెందిన ఓ యువకుడు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశారు. రూ.500లు ఇచ్చేవరకు మంజూరు చేయలేదు.

డబ్బులు తీసుకోవడం లేదు

రిజిస్ట్రేషన్, ఈసీ తదితర పనుల కోసం ఎవరి దగ్గర డబ్బులు తీసుకోవడం లేదు. ఎవరైనా డబ్బులు అడిగితేనా దృష్టికి తీసుకురావాలి. ఈసీలు పెండింగ్ పెట్టకుండా చూస్తున్నాం. స్పెషల్ అడిషనల్ స్టాంప్స్ కోసం ఇండెంట్ పెట్టాం.

- వేణుగోపాల్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, ఆలూరు

టీడీపీ నాయకుడికి పరామర్శ



శివప్పను పరామర్శిస్తున్న మీనాక్షినాయుడు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు దొడ్డనగేరి శివప్పను మాజీ ఎమ్మెల్యే, మీనాక్షి నాయుడు శుక్రవారం పరామర్శించారు. గ్రామంలో ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరేకల్లు రామకృష్ణ, హనవాళ్ బాష, అల్తాఫ్, తదితరులు ఉన్నారు.

'కోళ్ల ఫారాల వద్ద శానిటేషన్ చేయాలి'

మద్దికెర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోళ్ల ఫారాలు, చికెన్ దుకాణాల వద్ద శానిటేషన్ పనులు చేయాలని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి ఆదేశించారు. శుక్రవారం కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ మరణించిన కోళ్లను దూరంగా భూమిలో పూడ్చాలని, చెరువులు, కాలువల్లో వేయవద్దని ప్రజలకు సూచించారు. కార్యదర్శి శివకుమార్, సుధాకర్, పరమేశ్వరప్ప తదితరులు ఉన్నారు.

రాతిదూలం పోటీలతో ఉత్సాహం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ విజయకుమార్ నాయక్

మద్దికెర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాతిదూల పోటీలతో రైతుల్లో ఉత్సాహం వస్తుందని ఎస్‌ఐ విజయకుమార్ నాయక్, పశువైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం మద్దికెరలో పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, కవిరెడ్డి రామాంజులు, ఆకుల ఖాజావలి, కవిరెడ్డి గోపాల్ పాల్గొన్నారు.

మాలల సంక్షేమానికి కృషి చేయాలి



మాల కార్పొరేషన్ ఛైర్మన్‌తో నాయకులు

ఆదోని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాలల అభివృద్ధికి కృషి చేయాలని డివిజన్ మాల సంఘం నాయకుడు లక్ష్మీ నారాయణ కోరారు. శుక్రవారం మంగళగిరిలోని మాలల కార్పొరేషన్ కార్యాలయంలో ఛైర్మన్ విజయకుమార్‌ను కలిసి సన్మానించారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో పర్యటించి మాలల అభివృద్ధికి కార్యచరణ రూపొందిస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వాలు అన్యాయం చేశాయని, కూటమి ప్రభుత్వం మాలలకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. బాలాజీ, వన్నూరప్ప, గోపాల్, మల్లికార్జున, గిరిలు ఉన్నారు.

బర్డ్‌ఫ్లూతో తగ్గిన చికెన్ వినియోగం


- కొనేవారు లేక వెలవెలబోతున్న దుకాణాలు

హొళగుంద , ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసు నమోదుకావడంతో హొళగుందలో చికెన్, గుడ్ల వినియోగం తగ్గింది. దీంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. రోజుకు వంద కేజీల వరకు వ్యాపారం జరిగేదని ఇప్పుడు 20కేజీలకు పడిపోయిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెలవెలబోతున్న చికెన్ షాపు

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



ఏపీడీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

దేవనకొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను ఇవ్వాలని వ్యవసాయ సంఘం అధ్వర్యంలో పత్తికొండ ఏపీడీ పక్కీరప్ప,ఏపీవో రాజునాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లోనే పని కల్పించాలని మండల అధ్యక్షులు కృష్ణ, బజారి, నాగేశ్వరరావు అన్నారు. 200 పని దినాలు, కనీస వేతనం రూ.500 ఇవ్వాలని, పనిచేస్తూ మరణిస్తే రూ.5 లక్షల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భాస్కర్, నరేష్, శంకర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం నియంత్రణకు నిఘా

- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి

ఆలూరు రూరల్ , ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం నియంత్రణకు నిఘా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మద్యం ధరలను పెంచిందన్నారు. సారా, కర్నాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ లలితాదేవి, ఎస్సై నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే ధ్యేయం

- పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే

తుగ్గలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. శుక్రవారం రాతనకొత్తూరు గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో పాలన స్థంభించి, అభివృద్ధి కుంటు పడిందన్నారు. బటన్ నొక్కి ప్రజల గొంతు నొక్కారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాల్లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్, పింఛన్లు పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. పత్తికొండలో ఫ్యాక్టరీల ఏర్పాటుకు పెట్టుబడులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలోనే ఫ్యాక్టరీల నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. హంద్రీనీవా జలాలతో చెరువులను నింపి, సాగు, తాగునీటి కొరత లేకుండా చేస్తామన్నారు. పంట నష్టం వచ్చిన రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామన్నారు. వందశాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందిస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సుంకులమ్మకు పూజలు

ఎమ్మెల్యే శ్యాంబాబు శుక్రవారం సుంకులమ్మరే పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టారు. దైవమార్గంలో నడిస్తే ప్రశాంతత వస్తుందన్నారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మనోహర్ చౌదరి, వెంకటపతి కృష్ణమూర్తి చౌదరి, తిరుపాల్ నాయుడు, పాండు, కోటేష్ శ్రీనివాసులు, దేవేంద్ర, తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోండి

- జాయింట్ కలెక్టర్ నవ్య



క్రిష్ణగిరి: ఎరుకల చెరువు గ్రామంలో రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ

పత్తికొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో రైతుల అభ్యంతరాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని జేసీ నవ్య ఆదేశించారు. శుక్రవారం ఆర్డీవో భరత్ నాయక్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. వీఆర్వోలు, సర్వేయర్లకు సూచనలు చేశారు. అనంతరం జూటూరులో రీసర్వేను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం పత్తికొండ సివిల్ సప్లై గోదామును తనిఖీ చేశారు.

రీ సర్వే పకడ్బందీగా చేయండి

క్రిష్ణగిరి: రీ సర్వేను పకడ్బందీగా చేయాలని జేసీ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఎరుకల చెరువు గ్రామంలో రీ సర్వేను పరిశీలించారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పొరపాట్లు చోటుచేసు కోకుండా, రైతుల సమక్షంలోనే సర్వేను చేయాలని సూచిం చారు. ఆర్డీవో, తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ ఉన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



పాఠశాలలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్ , ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి నివాళి అర్పించారు. హెచ్‌ఎం కేశవయ్య మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య నిరుపేదల కోసం సంస్కరణలు చేశారని, దళితుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మన జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు ఉపాధ్యాయులు ప్రకాషమ్మ, నిర్మలమ్మ, శాంతి, మహాదేవి, మారెమ్మ, భారతీ, నరసన్న, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

ఆదోని: అంబేడ్కర్ నగర్‌లోని దామోదరం విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయినాథ్ నివాళి అర్పించారు. తొలి దళిత సీఎంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో పదవులు చేపట్టి ప్రజల అభివృద్ధికి పాటు పడ్డారని కొనియాడారు. మాజీ కౌన్సిలర్ దిలీప్ దోక, రామకృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ శ్రీనిత్ పాల్గొన్నారు.

పాఠశాలకు గుర్తింపు తేవాలి: డీఈవో

వెల్దుర్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలని డీఈవో శ్యామ్యూల్ పాల్ సూచించారు. శుక్రవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. నాయకుడు సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, సాయిప్రసాద్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన తెలుగు యువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ పదో తరగతిలో అధిక మార్కులు సాధించి మొదటి స్థానం సాధించిన వారికి రూ.10 వేలు, పాఠశాల అభివృద్ధికి మరో రూ.10 వేలు విరాళం అందజేశారు. ఎంఈవో ఇందిర, హెచ్‌ఎం చంద్రావతి, శైలజ, సుంకన్న, ఐజయ్య, లక్ష్మీనాథ్, రాజేశ్ పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న డీఈవో

రైతు సమస్యలను పరిష్కరించాలి

వెల్దుర్తి/ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సెలవులో ఉన్నారని తెలుసుకుని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గతంలో పట్టాలు పొందిన లబ్దిదారులు ఇళ్లను నిర్మించకపోవడంతో అర్హులైన ఇతరులకు ఇస్తామన్నారు. డీటీ గురుస్వామి, సర్వేయర్ హేమంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులు వేగవంతం చేయాలి

హాలహర్వి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపురం, హాలహర్వి, మాచనురు గ్రామాల్లో వాటర్ షెడ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రాజెక్టు అధికారి వలిబేగ్ సూచించారు. శుక్రవారం మాట్లాడుతూ రైతులకు అయిల్ ఇంజన్లు మరియు ఇతర సామగ్రి సబ్సిడీతో పంపిణీ చేస్తామన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

పత్తికొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొలువైఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవవం శనివారం ప్రారంభమవుతుందని నిర్వాహకులు ఎల్లారెడ్డి, తుప్పటి నాగన్న తెలిపారు. 15వ తేదీ నుంచి 23న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

సింహ గర్జనను జయప్రదం చేయండి

ఆలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఈనెల 16న తలపెట్టిన మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జి.మహానంది పిలుపునిచ్చారు. శుక్రవారం అర్అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. వర్గీకరణతో దళితుల్లో ఐక్యమత్యం లోపించి మతోన్మాద కుట్రలు తలెత్తుతాయన్నారు. క్రిమిలేయర్‌ను అమలు చేస్తే రాబోయే రోజుల్లో తీవ్రనష్టం కలుగుతుందన్నారు. ఈ తీర్పును దళితులు ఐక్యమత్యంతో వ్యతిరేకించాలన్నారు. కన్వీనర్ ఎంస్ భరత్, మల్లికార్జున, సురేష్, లోకేష్, మల్లేష్, రంగనాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ఆలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని వీరభద్రగౌడ్ సీఎంను కోరారు. శుక్రవారం అమరావతిలో చంద్రబాబును కలిసి వేదవతి, నగరడోన ప్రాజెక్టులు పూర్తి చేయాలని, ఆలూరు సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు.



సీఎంకు సమస్యలు వివరిస్తున్న వీరభద్ర గౌడ్

రాజకీయ కక్షతోనే మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టు

- రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న లోకేశ్
- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతోనే కూటమి ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్ట్ చేయించిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. శుక్రవారం చిప్పగిరిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలుకావడం లేదని, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. పాదయాత్రలో పేర్లు రాసకుని వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించడానికి ఏదో ఒక సంఘటన తెరమీదకు తెస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. బడ్జెట్ లేదని మాయమాటలు చెప్తు న్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి అప్పులు ఎక్కువగా చేశారని తప్పుడు మాటలు చెప్పి ప్రజలను మోసగిస్తు న్నారని ఆరోపించారు. అధికారులు కూటమి మాట లు విని అరెస్టులు చేయవద్దన్నారు. ప్రజలకు అవసరమైనవి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

రైతుల కష్టాలపై టీడీపీ నాయకుల లఘు చిత్రం



లఘు చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతుల కష్టాలపై వ్యవసాయం లఘు చిత్రాన్ని సరస్వతి పాఠశాలలో టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, వీరేష్, మాజీ ఉపాధ్యాయుడు మహమ్మద్ బాషా ఆవిష్కరించారు. దేవనకొండకు చెందిన రాజు, ప్రదీప్ రైతులు అప్పులపాలై ఆత్మహ త్యలు చేసుకునే అంశంపై ఈ లఘు చిత్రన్ని తీశారు. రైతులు ఆధునిక పద్ధతిలో సాగుచేస్తే నష్టపోరని సూచించారు. కరస్పాండెంట్ కృష్ణమూర్తి, హెచ్‌ఎం ముజీబుర్, నజీర్ బాషా పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లులో పంచాయతీ బోర్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సర్పంచ్ ఉమాదేవి కోరారు. శుక్రవారం మాట్లాడుతూ పంచాయతీ నిధులతో తాగునీటి బోర్లను వేశామని, విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు

క్రీడలతో మానసిక ఉల్లాసం

మద్దికెర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. జడ్పీ బాలుర పాఠశాలలో శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతకు రూ.10వేలు, రెండో విజేతకు ఆపద్బంధవ సేవా సమితి వ్యవస్థాపకుడు చొక్కా సునీల్ కుమార్ రూ.5వేలు అందజేశారు.



అభినందనలు తెలుపుతున్న నాయకులు



మాట్లాడుతున్న రమేష్ నాయుడు

హామీలను నెరవేర్చాలి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఎస్టీయూ ఉపాధ్య క్షుడు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. హామీల అమలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. 12వ పీఆర్‌సీ నియమించి, మంచి ఫిట్మెంట్ ఇస్తామన్న హామీ నెరవేర్చకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగి దాచుకున్న సొమ్ము ఏళ్ల తరబడి అందని పరిస్థితి ఉందన్నారు. వీరచంద్ర యాదవ్, భీమరాజు, గురురాజా, శ్రీరాములు, మధుసూదన్ రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని పూర్తి చేయాలి

- హైవేను దిగ్బంధించిన ప్రజాసంఘాలు
- ఎస్‌ఐ హామీతో ఆందోళన విరమణ



రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న నాయకులు

ఆలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులు పూర్తికాక ప్రజల ప్రాణాలు పోతున్నా లెక్కలేదా అని సీపీఐ, సీపీఎం నాయకులు భూపేశ్, రామాంజినేయులు, హనుమంతు, రంగన్న, బాషా మండిపడ్డారు. శుక్రవారం ఆలూరులో, ప్రజలు, నాయకులు రోడ్డుపై నిరసనకు దిగారు. దీంతో గంట పాటు ఆలూరు-బళ్లారి మార్గంలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై దిలీప్ కుమార్ జోక్యం చేసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని, ఆందోళన విరమించాలని నచ్చజెప్పినా వారు వినలేదు. ఎస్సైకు ప్రజా సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులు వచ్చేవరకు ఆందోళన విరమించబోమని తేల్చి చెప్పడంతో ఆర్అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. వారు 20 రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇప్పించడంతో ఆందోళనను విరమించారు. ఆందోళనకు వైసీపీ నాయకుడు వైకుంఠం మల్లికార్జున చౌదరి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షైనా, నాయకులు బాషా, అజంత లక్ష్మీరెడ్డి, రమేష్, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రుద్రగౌడు

కోసిగి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోసిగిలో వెలసిన రేణుకా ఎల్లమ్మదేవి రథోత్సవాన్ని ఈనెల 17న నిర్వహించనున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ రుద్రగౌడు అన్నారు. శుక్రవారం కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి సంజిపోగు అయ్యమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రుద్రగౌడు మాట్లాడుతూ ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక స్నానపు గదులు, మంచినీరు, మరుగుదొడ్లు సౌకర్యం ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు కూడా చేపట్టాలని కోరారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, ఈవోపీఆర్‌డీ హరూన్ రషీద్, మెడికల్ ఆఫీసర్ డా.మనోజ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, మాణిక్యరాజు, రాజేష్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్, హోళగుంద కోసిగయ్య పాల్గొన్నారు.

ప్రజలు శాంతియుతంగా జీవించాలి: డీఎస్పీ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ప్రశాంత జీవనాన్ని సాగించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు వెళ్లరాదన్నారు. అనవసరమైన గొడవలు, ఘర్షణలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు గురుజాలలో టెంకాయల వేలం

నందవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గురుజాల రామలింగేశ్వరస్వామి ఆలయం దగ్గర టెంకాయల వేలం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహక అధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు శనివారం 11 గంటలలోపు గురుజాలలోని రామలింగేశ్వర ఆలయానికి రావాలన్నారు.

విద్యార్థుల కోసం బస్సు సర్వీసు

కౌతాళం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆదోని ఆర్టీసీ సర్వీసు వందగల్లు గ్రామానికి వస్తున్నా తమ గ్రామానికి రాకపోవడంతో విద్యార్థులు తమ సమస్యను గ్రామ సర్పంచ్ పుష్పలత దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వందగల్లుకు వస్తున్న సర్వీసును కరణికి నడపాలని కోరారు. దాంతో శుక్రవారం వందగల్లు సర్వీసు కరణి గ్రామానికి రాగా సర్పంచ్ బస్సుకు పూజ చేసి విద్యార్థులను, ప్రజలను అందులో ఎక్కించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామ ప్రజలు సర్పంచ్ పుష్పలతకు కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్యశిబిరం

కోసిగి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కొండేయ స్వామి కల్యాణ మండపం హాలులో ఎమ్మిగనూరు చెందిన ఆర్‌కే కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ హేమంత్ కుమార్ 150 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమానికి హాజరైన కోసిగి సీఐ మంజునాథ్‌ను సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

నేటి నుంచి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

కోసిగి ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా మౌంట్ కార్మెల్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ అభిరానంద, శ్రీధర్, ఆకాష్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ నేటి నుంచి 17వరకు ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంటు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.1000 చెల్లించి జట్ల పేరును నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులు ఉంటాయన్నారు. వివరాల కోసం 9398073095, 6304617237, 9390070544లను సంప్రదించాలన్నారు.

లింగ వివక్షను రూపు మాపాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి రఘు

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరు సమానమేనని, లింగవివక్షతను రూపుమాపాలని నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో జిల్లా సంచార చికిత్స కార్యక్రమం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి రఘు మాట్లాడుతూ ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలన్నారు. డాక్టర్ జాహ్నవి, హెచ్‌ఎం రఘు, సిబ్బంది ఖలీల్‌లు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మునిస్వామిగౌడ్

గోనెగండ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా గోనెగండ్లకు చెందిన మునిస్వామిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గోనెగండ్ల మండల ఇన్‌చార్జి వెల్బుల గోపాల్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అలాగే మండల ఉపాధ్యక్షులుగా చిన్నఈరన్నగౌడ్, పెద్దమరివీడు బోయబజారి, సుంకన్న, చిన్నమరివీడు రంగన్న, మల్లికార్జునరెడ్డి, పరమేష్, ప్రధానకార్యదర్శులుగా కడపల రమేష్, కులుమా వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శులుగా కడియాల తాయన్న, ధరణి, బోయ ఈరన్న, చిన్న రంగన్న, పరమేష్, సోమేష్‌నాయుడు, కోశాధికారిగా నాగవేణి, 16మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నందవరం: బీజేపీ మండలం కమిటీని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి భగత్‌జీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా గువ్వల నారాయణ, ఐదుమంది ఉపాధ్యక్షులు, 16 మందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు జగ్గాపురం ఈరన్న, అయ్యపురెడ్డి, ముగతి దస్తగిరి, రాజేష్, శ్రీనివాసరెడ్డి, చంద్రగౌడు, గువ్వల విశ్వనాథ్‌నాయుడు పాల్గొన్నారు.

రక్త పరీక్ష నిర్వహించాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తి రక్త నమూనాలను సేకరించి పరీక్షించాలని ఆదోని సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్ష ల్యాబ్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు హనుమంతు, పరమేశ్వర పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి





దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, కౌతాళంలో..

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మాదన్న అధ్యక్షతన సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కదిరికోట ఆదెన్న, భాస్కర్, మల్లేష్, జగతాప్, జయపాల్, మార్కు, బాబు, మారెప్ప పాల్గొన్నారు.

కౌతాళం: దామోదర సంజీవయ్య జయంతిని శుక్రవారం కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్బరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంజీవయ్య చిత్రపటానికి సిబ్బందితో కలిసి ఎంపీడీవో పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: దామోదర్ సంజీవయ్య ఆశ యాలు అందరికీ ఆదర్శమని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం సంజీవయ్య జయంతి గోనెగండ్లలోని పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ పుల్లన్న, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో..

18న బంగారమ్మ ఉత్సవాలు

మంత్రాలయం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వెలసిన బంగారమ్మ, దేవమ్మల గ్రామ దేవర ఈ నెల 18 నుంచి వైభవంగా ప్రారంభం కానున్నది. ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. రూ.1.20 కోట్లతో కొత్తగా నిర్మించిన దేవాలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ఆదోని రోడ్డులో నూతనంగా నిర్మించిన మహాముఖద్వారం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేవర ఉత్సవాలకు మేతీల నాయకులు జెట్టి నరసింహులు, యాగంటి వీరేష్, చింతల కర్రెప్ప, బొజ్జప్ప కడితట్ల వెంకప్ప, మూలింటి హనుమంతప్ప, అయ్యన్న, ఆంజనేయ, ముక్కిడప్ప ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే దేవాలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న బంగారమ్మ ముఖ స్వరూపాన్ని మంత్రాలయానికి చెందిన శివరాంబ్రదర్స్ చేయించారు. జడ్పీటీసీ మజ్జిగ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత, ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, జయలక్ష్మి, ఆధ్వర్యంలో రాజకీయలకతీతంగా ఉత్సవాలకు పెద్ద ఎత్తున జరిపేందుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో ఇంటికి రూ.3లక్షలు పైనే ఖర్చు చేయనున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాం జులు, మాధవరం ఎస్ఐ విజయకు మార్ సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో పోలీసు బందోబస్తు నిర్వహిస్తు న్నారు.



బంగారమ్మ దేవత మూలవిరాట్

● ఆకట్టుకోనున్న

పౌరాణిక నాటకాలు

రచ్చుమర్రిలో గ్రామ దేవర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న శ్రీరామలింగేశ్వర నాట్యమండలి వారిచే నవమాంకములు, మాయసభ, శ్రీకృష్ణ తులాభారం, కర్ణ రహస్యం, నారదుడు, సుభద్ర, గయాపాఖ్యానం, శశిరేఖా అభిమన్యుల పరిణయం, రామాంజనేయ యుద్ధం, ఉత్తర అభిమాన్యు పౌరాణిక నాటక ప్రదర్శనలు అలరించనున్నాయి. 20న మధ్యరాట్ పోతులూరి విర(బ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను గ్రామానికి చెందిన దళితకళాకారులు ప్రదర్శించనున్నారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై ఊరేగారు. శుక్రవారం మాఘవిధియ శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

మంచాలమ్మకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. శుక్రవారం మాఘమాస విధియ శుభదినం సందర్భంగా పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



మంచాలమ్మకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

దోమల నివారణకు ఫాగింగ్

కోసిగి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ పంచాయతీ పరిధిలో దోమల బెడద అధికంగా ఉండటంతో సర్పంచ్ కుమారి సంజిపోగు అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్మికులు ఫాగింగ్‌ను చేపట్టారు. కోసిగి అన్ని వార్డుల్లో మూడురోజులపాటు ఫాగింగ్ చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు: సీఐ

మంత్రాలయం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థల వివాదంలో ఇరువర్గాలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడకూడదని, అలా చేస్తే కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామని సీఐ రామాంజులు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో శ్మశాన స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ అదికారులు సమస్యను పరిష్కరించేంత వరకు ఆ స్థలంలోకి ఇరువర్గాలు వెళ్లవద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఐకమత్యంగా గ్రామ అభివృద్ధికి ఒకరికొకరు సహకరించుకోవాలని, ముందుకు సాగాల న్నారు. ఇరువర్గాల గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడు

నందవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేక ప్రైవేట్, బ్యాంక్ అప్పులు భారమై కట్టలేక ఆత్మాభిమాన్ని చంపుకోలేక రైతులు ఆత్మాహత్య చేసుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, నాగేష్, చెన్నప్ప, తాయన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంపీడీవో

కౌతాళం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఎంపీడీవో సుబ్బరాజు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు అబాకస్ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను మెమెంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, సెక్రటరీ మైనుద్దీన్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలి



రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు /పెద్దకడుబూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చెట్నిహళ్లి గ్రామంలో వివాదాస్పదంగా మారిన శ్మశానవాటిక సమస్యను పరిష్కరించి దళితులకు న్యాయం చేయాలని జైభీం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు బుజ్జిబాబు, ఇన్‌చార్జి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పెద్దకడుబూరు రెవెన్యూ సిబ్బందికి కూడా వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు యర్రన్న, ఆదాము, నాయకంటి నాగరాజు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయండి

ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

గోనెగండ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అందులో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండరాదని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం గోనెగండ్లలో సబ్ కలెక్టర్ పర్యటించారు. రైతులతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే చేసే సర్వే నెంబర్‌లోని రైతులకు తప్పనిసరిగా ముందుగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. రీసర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి వర్మి కంపోస్టును తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం కింద ర్యాలీ నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా కలెక్టర్ రంజిత్ బాషా వస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎల్‌పీవో నూర్జహన్, తహసీల్దార్ కుమార స్వామి, ఎంపీడీవో మణిమంజరి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, రీసర్వేయర్ శిరీషా, ఈవోఆర్‌డీ అనంతశయన, పంచాయతీ కార్యదర్శి సతీష్, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రీసర్వే చార్టును పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

బాలికల భద్రత సామాజిక బాధ్యత



ప్రసంగిస్తున్న సఫరున్నిసా

గోనెగండ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బాలికల భద్రత సామాజిక బాధ్యత అని కర్నూలు జిల్లాను బాలల స్నేహ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మిగనూరు ప్రాజెక్టు మహిళా శిశు అభివృద్ధి అధికారి సఫరున్నిసా అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్, ఆర్‌డీటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు కూడా తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకొని అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. సమావేశంలో గోనెగండ్ల సీఐ గంగాధర్, ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ, ప్రిన్సిపాల్ విద్యావతి, రాధారాణి, ఆర్‌డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, సుబ్బన్న పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించాలి

నందవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నందవరం ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో కంపచెట్లను తొలగించాలని కాలనీవాసులు కోరారు. శుక్రవారం ఎంపీడీవో పుల్లయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకిరేవు వంక దగ్గర నుంచి పూలచింతకు వెళ్లే రహదారి వరకు ముళ్ల కంపలు పెరిగిపోయాయన్నారు. ముళ్లకంపను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీవాసులు, జైభీమ్ నాయకులు చింపిరి పోతప్ప మాదిగ, శవాలశాంతిరాజు,గంథాలం తాయన్న మాదిగ, శవాల ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులు వలస వెళ్లకుండా చూడాలి

కోసిగి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రుల వెంట వలస వెళ్లకుండా బడిలో చదువుకునే విధంగా చూడాలని కోసిగి ఎంఈవో-2 శోభారాణి సూచించారు. శుక్రవారం కోసిగిలోని హెచ్‌జీ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో-2

బాల్య వివాహాలతో అనర్థాలే

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో పెళ్లిళ్లు చేసుకుంటే అనేక అనర్థాలు ఎదురవుతాయని ఎంఈవో-2 మధుసుదన్ రాజు, సీడీపీవో సఫరున్నిసాబేగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18ఏళ్లు పూర్తయ్యే వరకు చదివించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రతినిధి సుదర్శన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్లు, యజమానులు రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదోని ఎంవీఐ శశీరాదీప్తి సూచించారు. శుక్రవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో వాహన డ్రైవర్లు, లారీ యజమానులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని 10వ వార్డు కటికె వీధిలో సీసీ రోడ్లు వేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, నాయకులు సురేష్, కేవీపీఎస్ నాయకులు ఆంథోని డిమాండ్ చేశారు. శుక్రవారం వార్డులో పర్యటించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు సుభాన్, అబ్దుల్, బజారి, పరమేష్, ఈరన్న, లక్ష్మి, పులిరాజు, నాగరాజు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ఈనెల 17న సీడీపీవో కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, సీఐటీయూ నాయకులు రాముడు కోరారు. శుక్రవారం సీడీపీవో సఫరున్నిసా బేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు హాజరుకావాలని కోరారు.